# నగల పిచ్చి నాంచారమ్మ

## -డా.కె.వాణీ చలపతిరావు

మా అబ్బాయి పెళ్లి ఇంకా ఐదురోజులు ఉందనగా నాంచారమ్మ పిన్ని నుంచి ఫోన్ వచ్చింది 'సాయంత్రం బండికి వస్తున్నాననీ, స్టేష న్‌కు ఎవరినైనా పంపించమనీ' నా గుండె ఠార్‌మంది ఆ వార్తతో.

అంతగా నా గుండె హడలిపోవడానికి కారణం... ఆమె వస్తున్నం దుకు కాదు, ఆమె వెంట నగల దుకాణం వస్తున్నందుకు, దానికి కాపలా కాయడం మా బాధ్యత కాబోతున్నందుకు.

ఈ లోకంలో ఒక్కొక్కళ్లకు ఒక్కో పిచ్చి ఉన్నట్లు మా నాంచా రమ్మ పిన్నికి నగల పిచ్చి ఉంది.

ఆ పిచ్చి ఆయినా అట్టాంటి ఇట్టాంటి పిచ్చి కాదు... బాగా ముదిరి పోయిన మహాపిచ్చి. శరీరంలో ఎన్ని అవయవాలు ఉన్నాయో అన్నింటికీ ఒక్కదానికీ తక్కువ కాకుండా రకరకాల నగలు ఉండా లన్నది ఆమె పాలసీ.

చెవులకు దిద్దులు, ముక్కుకు పుడకలు, నెత్తిన పాపిటబిళ్ల ప్లస్ నెలవంకలు, మెళ్లో హారాలు, నెక్లెసులు, చేతులకు దండి కడి యాలు, గాజులు, నడుముకు వడ్డాణం, కాళ్లకు పట్టీలు... ఇలా పై నుంచి కిందవరకూ రకరకాల నగలు ధరించి నడుస్తున్న నగల కొట్టులా వుంటుంది నాంచారమ్మ పిన్ని.

అందులో రెగ్యులర్‌గా పెట్టుకునేవే బోలె డుంటే ఇనప్పెట్టెలో దాచుకుని పండుగలకూ, పబ్బాలకు, పెళ్లిళ్లకు, పేరంటాలకు పెట్టుకునే ప్రత్యేకమైన నగలు అనేకం. అందులో రంగురం గుల రాళ్లవీ, రత్నాలవీ, పచ్చలవీ, ముత్యాలవీ, పగడాలవీ కాక గోమేధికాలు, కనక పుష్యరాగాలు కూడా ఉండేవి.

ఆవిడ నగలు ఎంత పెద్ద కలెక్షన్ అంటే ఎగ్జిబి షన్ లాంటిదేదైనా ఏర్పాటు చేస్తే జనం ఖచ్చి తంగా క్యూలో నిలబడి మరీ టిక్కెట్టు కొనుక్కుని చూడడానికి వస్తారు.

పిన్నికి పట్టుకున్న ఈ పిచ్చి ఈనాటిదికాదు. చిన్నపిల్లగా ఉన్నప్పటి నుంచే మొదలైంది. నాకు బాగా గుర్తు.

మా ఊళ్లో మా అమ్మావాళ్ల ఇంటిపక్కనే పిన్నివాళ్ల ఇల్లు ఉండేది.

అప్పుడు పిన్నిని అందరూ నాంచారూ అని పిలిచేవాళ్లు.

వరుసకు అమ్మకు చెల్లెలయినా ఇద్దరిమధ్యా వయసు వ్యత్యాసం మాత్రం చాలా ఉండేది.

నాంచారమ్మ పిన్ని నాన్నగారు పెద్ద భూకా మందు ఆ రోజుల్లో. వందల ఎకరాల పంట పొలాలకు ఆస్తిపరుడు.

ముగ్గురు కొడుకుల తరువాత పుట్టిన నాంచా రమ్మ పిన్నిని 'మా ఇంటి మహాలక్ష్మి' అంటూ చాలా గారాబం చేసి ఆ తరువాత ఒంటినిండా నగల తొడుగుతో కనకమహాలక్ష్మిలా మార్చే సారు.

మెళ్లో ఒక గొలుసు, జడకుప్పెలతో సాధార ణంగా ఉండే నేను నాంచారమ్మ పిన్ని వళ్లంతా నగలు చూస్తుంటే ఆశ్చర్యంతో నోరెళ్ళబెట్టి ఉండిపోయేదాన్ని.

నోట మాట వచ్చేదికాదు. 'ఎందుకమ్మా తాయారూ! నాకేసి అలా చూస్తావు... దిష్టి పెడ తావా ఏంటీ?' అనేది నాంచారు పిన్ని గమ్మ త్తుగా దీర్ఘం తీసి మాట్లాడుతూ.

ఆ మాటల్లో తను కలవారి అమ్మాయిననే టెక్కూ, నిక్కూ కనబడేవి.

తను పెట్టుకున్న నగల గురించిన గర్వం కళ్లల్లో తొంగి చూసేది.

అలా...అలా చిన్నప్పటినుంచీ అలవాటైన నగలు కర్ణుడికి కవచకుండలాల్లా ఆమె వంటిని వదిలిపోననడమేగాక రానురాను లేటెస్ట్ ఫ్యాష న్లతో మరీ వయ్యారాలుపోయాయి. అయితే ఇక్కడ ఒక ముఖ్య విషయం ఏమిటంటే అంత ఆసక్తిగా నాంచారు అన్ని నగలు పెట్టుకున్నా ఏ ఒక్కటీ ఆమె వంటిమీద నప్పేదికాదు. పైపెచ్చు ఎబ్బెట్టుగా ఉండేవి.

నాంచారు పిన్ని చామనఛాయ కన్నా కొంచెం రంగు తక్కువనే చెప్పాలి. చిన్నప్పుడు కాస్త బక్కపలచగా ఉన్నా గ్రాడ్యుయల్‌గా లావు ఊరుతూ వచ్చింది.

దాంతో పరంధామయ్య తాతగారికి కూతురి పాతనగలన్నీ సైజు సరిపోక చెడగొట్టి కొత్తవి చేయించాల్సి వచ్చింది. కాసుల పేరు స్థానంలో చంద్రహారం, దండకడియాల బదులు వంకీలు ఇలా...!

పద్దెనిమిదేళ్లు వచ్చేసరికి పొడుగు ఎదగడం మానేసిన నాంచారు పిన్ని అడ్డంగా మాత్రం ఊరడం మొదలుపెట్టింది.

దాంతో కుదేసిన గుమ్మడికాయలా, పిడి బిగించని రుబ్బురోలులా గుండ్రంగా తయారు యింది.

ఆమె వంటి బరువుకు తోడు నగల బరువు ఒకటి. లేని నగ లేదు ఆమె వంటిమీద.

పెళ్లిచూపులనాడు నాంచారు పిన్నిని 'చాపేసి కూర్చోబెడితే పెట్టుకున్న నగలు కనబడ వని' కుర్చీమీద కూర్చోబెట్టారు.


బక్కపలచగా, గడకర్రలా పొడుగ్గా అంతె త్తున ఉన్న పెళ్లి పిల్లాడితోపాటు అతని తల్లీ

దం(డ్రీ వచ్చి పిల్ల నచ్చకపోయినా పిల్ల వంటి మీది నగలు నచ్చి పెళ్లికి ముహూర్తం పెట్టించమని చెప్పారు.

ఆ ముక్క చెప్పడానికి ముందు అంత బాలతొడుగూ పెట్టి కన్నెధారపోస్తామని ఒప్పందం చేసుకున్నారు.

తాము 'అత్తింటి' నగలు పెట్టడానికి పిల్ల ఒంటిమీద ఏ ఒక్క అవయవం ఖాళీగా లేదు కనుక పెట్టడంలేదని మాటా ముచ్చట రోజే చెప్పేసారు. ఆ మాటలకు పరంధామయ్య తాత గర్వంగా చిరునవ్వు నవ్వడం, తల ఊపడం ఇప్పటికీ నాకు బాగా గుర్తు.

నాంచారు పిన్ని పెళ్లయిన రెండు మూడు సంవత్సరాలకే నా పెళ్లి అవడంతో ఆ తరువాత మా పుట్టింట్లో ఒకటి రెండుసార్లు తప్ప మళ్లీ ఆవిడను



కల్పుకోలేదు.

ఇప్పుడు ఇన్నేళ్ల తరువాత మా ఇంట్లో ఫంక్షన్‌కు నాంచారమ్మ పిన్ని వస్తుండడం నాకు ఆనందోద్వేగాలను కలిగిస్తున్నా నాంచారమ్మ నగల పిచ్చి తగ్గలేదనీ, ఇంకా అధికమయిందనీ అమ్మ చెప్పిన తరువాత బోలెడంత భయం కూడా పట్టుకుంది.

అసలే మా ఊళ్లో దొంగల భయం. పట్టపగలే పుస్తెలతాళ్లు లాగేసే చేతివాటంవాళ్లేకాక తాళాలు పగులగొట్టి అలమారాలు కొల్లగొట్టి... ఇలా రకరకాలుగా దొంగతనాలు చేస్తున్నారు.

అతిథిగా వస్తున్న నాంచారమ్మ పిన్ని నగలను ఎలా కాపాడడం? అనుకున్నాను భయం భయంగా.

★★★

మా పనిమనిషి రత్తమ్మకు చెప్పి ఒకసారి దాని మొగుడు భీమయ్యను రమ్మని కబురు పెట్టాను.

భీమయ్య పేరుకు తగ్గట్టు భీముడిలాగే ఉంటాడు ఒడ్డూ పొడుగూ, బలిష్టమైన శరీరంతో.

ఇంతకుముందు ఏదో బ్యాంకులో సెక్యూరిటీ గార్డుగా పని చేసి ఈమధ్యనే రిటైర్ అయ్యాడు.

"ఏంటమ్మా రమ్మన్నారుట?" అన్నాడు వస్తూనే.

విషయమంతా వాడికి వివరించి 'ఓ పదిరోజులు మా నాంచారమ్మ పిన్ని నగలకు సెక్యూరిటీ గార్డ్‌గా పని చేయాలనీ, ఎల్లుండి ఆవిడ బండి దిగిన క్షణం నుంచీ అతని డ్యూటీ ప్రారంభమవుతుందనీ, అందుకు ఎంతో కొంత పే చేస్తానని చెప్పాను.

కాకుంటే సివిల్ డ్రెస్‌లో వచ్చి తాను ఆమె నగలకు కాపలాదారు అన్న విషయం ఆమెకు తెలియకుండా మేనేజ్ చేయాలని చెప్పాను.

ఎందుకంటే తన రాక తమ బంధువులకు భయాన్ని, ఇబ్బందిని కలిగిస్తున్నదన్న భావం ఆమెలో ఎట్టి పరిస్థితుల్లోనూ కలగడానికి ఆస్కారం ఇవ్వకూడదు కనుక.

అన్నింటికీ 'అట్టాగే' అని తల వూపి భీమయ్య వెళ్లిపోయాక హమ్మయ్య అని గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాను.

ఇక నిశ్చింతగా మా ఇంటి పెళ్లిపనులు నేను చేసుకుంటూ వేడుకలలో, ఆహ్వానితుల ఆదరణలో సరదాగా గడపవచ్చు అన్న ఆలోచన నాకెంతో హాయిని కలిగించింది.

దాంతో పెళ్లి సామాన్ల కొనుగోలు ఊపందుకుని బంధుమిత్రులకు ఆహ్వానపత్రికలు పంపించడం, స్వయంగా పెళ్లిపిలుపుల కార్యక్రమం కూడా అయిపోయింది.

★★★

ఆ రోజే నాంచారమ్మ పిన్ని, రమణయ్య బాబాయి వచ్చేది. నేను, భీమయ్య కారు తీసుకుని సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లాం.

మమ్మల్ని స్టేషన్ ముందు దింపి డ్రైవర్ కారును పార్కింగ్ ప్లేస్ వైపు తీసుకువెళ్లాడు.

ఎండకాలం కావడంతో చాలా ఉక్కపోతగా ఉంది. ప్లాట్‌ఫామ్ అంతా జనసమ్మర్దంతో, ప్రయాణికుల భారీ సామాన్లతో నిలబడడానికి కూడా వీలులేనంత రద్దీగా ఉంది.

పైగా బండి అరగంట ఆలస్యం. నా ఓపికకు పెట్టవలసినంత పరీక్ష పెట్టాక చివరకు ఎల్లాగైతేనేం రైలు వచ్చింది.

కోచ్ నెంబర్ వెతుక్కుంటూ నేనూ, భీమయ్య ముందుకు నడిచాం. ఇంతలో చేతిలో సూట్‌కేసుతో స్ప్రింగ్‌లా అమాంతం రమణయ్య బాబాయ్, ఆ వెంటనే ఆపసోపాలు పడుతూ చేతిలో సంచీతో నాంచారమ్మ పిన్ని దిగారు.

ఎవరో అప్పుడే ఆర్డర్ పాస్ చేసినట్లు పిన్ని వెనకాల పొజిషన్ తీసుకుని స్టిఫ్‌గా నిల్చుండిపోయాడు భీమయ్య.

మరీ అంత ఓవర్ యాక్షన్ వద్దన్నట్లు నేను సైగ చేయడంతో మనిషి కాస్త లూజ్ అయి దిక్కులు చూస్తున్నట్లు నటించడం మొదలుపెట్టాడు.



## మళ్లీ బికినీలో ప్రియమణి!

'ద్రోణ' చిత్రంలో బికినీతో కనిపించడం ద్వారా తాను సంచలనానికి కేంద్రబిందువు అవుతానని, యువ హృదయాలను కొల్లగొడతానని ఎంతగానో ఆశపడిన ప్రియమణి ఆశ అడియాస అయింది. ప్రేక్షకుల నుంచి ఆశించినంత రెస్పాన్స్ రాలేదు. 'గోలీమార్' చిత్రంలో ప్రియమణి మరోమారు బికినీలో కనిపించనుందనే వార్తలు గుప్పుమంటున్నాయి. ఈ విషయమై ప్రియమణిని అడిగితే 'నో కామెంట్' అని సింపుల్‌గా తప్పించుకుందిట! ఏది ఏమైనా 'గోలీమార్' చిత్రం విడుదల అయితేగానీ వాస్తవాలు బయటపడవు.



పిన్ని రైలు దిగగానే ఆమెమీదకన్నా నా దృష్టి ఆమె ధరించిన నగలమీదే పడింది.

పిన్ని మాత్రం ఏమీ మారలేదు, శరీరాకృతితప్ప. పెద్ద బొట్టు, భారీ కాయం, వళ్లంతా పెట్టుకున్న నగలతో వున్న పిన్నిని చూడగానే నాకెందుకో గుళ్లో అమ్మవారు గుర్తొచ్చి అప్రయత్నంగా చేతులు జోడించి దండం పెట్టాను.

"నువ్వు నాకు దండం పెట్టడమేంటే తాయారూ.. ఈ మర్యాదలు కొత్తగా నేర్చుకున్నావా?'' అంటూ అమాంతం నామీద పడి నన్ను కౌగలించుకుంది పిన్ని.

"అబ్బా'' అన్నాను పిన్ని వంటిమీది నగలు నాకు గుచ్చుకుని నొప్పి పుట్టడంతో.

"ఏమయింది?'' అన్నాడు బాబాయి.

"ఏంలేదు'' అన్నాను నేను నవ్వుతూ.

"మీ పిన్ని నగలు గుచ్చుకుని ఉంటాయి. కనిపెట్టేసాను. ముప్పయి అయిదేళ్ల అనుభవం మరి'' అన్నాడు బాబాయి తమాషాగా.

"వీడెవడే? ఇందాకటి నుంచీ నా వెనుకే నిల్చుని ఉన్నాడు. కొంపదీసి ఏ దొంగ వెధవ అయినా కాదుకదా?'' అంది పిన్ని భీమయ్య వంక అనుమానంగా చూస్తూ.

"లేదు పిన్ని. మా పనిమనిషి మొగుడు. లగేజీ ఎక్కువ వుంటుందేమో సామాన్లు మోయడానికి పనికొస్తాడు అని తీసుకువచ్చాను. అయినా నువ్వు ఉన్నన్నినాళ్లూ నీకు ఆ పనులు ఈ పనులు చేసి పెడుతూ నీ వెంటే ఉంటాడులే పిన్నీ'' అన్నాను.

"ఈ ఏర్పాట్లు మీ పిన్నికి ఒక్కదానికేనా? పెళ్లికొస్తున్న చుట్టాలందరికీ చేయిస్తున్నావా?'' అని అడిగాడు బాబాయి అనుమానంగా నావంక చూస్తూ.

నా గొంతుకేదో అడ్డం పడినట్లు అయింది.

"ఆ...అందరికీనా ఏదో పెద్దవాళ్లు అని. అయినా పిన్ని అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం'' అన్నాను.

"అనుకున్నాను'' అన్నాడు బాబాయి భావగర్భితంగా. ఏదో రహస్యం చెబుతున్నట్లుగా నా పక్కకు వచ్చి నా చెవిలో "ఆ వంటిమీద ఉన్నవే నగలు అనుకుంటున్నావేమో? పెళ్లికి పెట్టుకోబోయే స్పెషల్ నగలు ఇదిగో ఈ పెట్టెలో ఉన్నాయి. అందుకే ఇందాకటి నుంచీ దీన్ని చంకలో పెట్టుకుని తిరగలేక చస్తున్నాను'' అన్నాడు బాబాయ్.

మాకు వెనుకగా నడుస్తున్న పిన్ని 'స్పెషల్ అరేంజ్‌మెంట్' అన్నంతవరకే విని ఉండడంతో "దానికి నామీద ఎంత అభిమానం లేకుంటే పెళ్లి పనుల్లో బిజీగా ఉండీ నన్ను రిసీవ్ చేసుకోవడానికి స్వయంగా తను వస్తుంది'' అని దీర్ఘం తీసింది.

నా పాట్లు నావి. అవి పిన్నికెలా తెలుస్తాయి? పిల్లల్ని పంపిస్తే పిన్ని నగల విషయంలో సరైన కేర్ తీసుకోరేమో... ఏదన్నా అయితే మళ్లీ మాట వస్తుంది' అని పనులను కాస్త పక్కనపెట్టి నేనే స్వయంగా భీమయ్యతో సహా వచ్చానని పిన్నికి ఎలా చెప్పను?

అందుకే అభిమానంతోనే వచ్చానన్నట్లుగా నవ్వి ఊరుకున్నాను. అందరం వెళ్లి కార్లో కూర్చున్నాం.

"కోడలికి ఏం నగలు చేయిస్తున్నావు?'' అనడిగింది పిన్ని.

"దీనికెప్పుడూ నగల పిచ్చే. ఏం చదువుకుందనీగానీ, ఎలా ఉంటుందనీగానీ అడుగుతుందేమో చూడు'' అని బాబాయ్ నా వంక తిరిగి "నువ్వేమిటమ్మా తాయారూ... మరీ ఒక్క పుస్తెలతాడుతో, మామూలుగా వున్న లక్ష్మీదేవిలా ఉన్నావ్? ఓ కిలోనో రెండు కిలోలో నగలయినా వేసుకోలేదేమిటి?'' అని అడిగాడు.

పిన్ని అందుకుంటూ "అదంతా నన్ను దెప్పడంలే. మా పుట్టింటివాళ్లు బోలెడు నగలు పెట్టబట్టి సరిపోయిందిగానీ ఈయనే చేయించాలంటే ఇంకెంత సాధించేవారో'' అంది చేతులు తిప్పుతూ. అప్పుడు ఆమె చేతుల కున్న కంకణాలు గలగలా శబ్దం చేసాయి.

"అది నువ్వు మాట్లాడేది చరిత్ర. వర్తమానం గురించి మాట్లాడు. పాతవి చెడగొట్టి చేయించుకున్నవాటికీ, కొత్తగా బంగారం షాపులో ఆర్డరిచ్చి కొను




## హైయెస్ట్ జంప్

ఆస్ట్రేలియన్ స్టంట్ మోటోక్రాసర్ 28 ఏళ్ల రాబీమడిసన్ ఇటీవల గ్రీస్‌లో 100 మీటర్ల ఎత్తున 85 మీటర్ల వెడల్పున్న రెండు కొండల నడుమ ప్రవహించే కోరిన్త్ కెనాల్ మీదుగా హైయెస్ట్ జంప్ చేసి రికార్డు స్థాపించాడు.

## కేన్సర్ నివారణకు కొత్త పద్ధతి

ఇప్పటివరకు కేన్సర్ చికిత్సకి వాటి కణాలను టాక్సిన్ డ్రగ్సుతో చంపుతూ కెమోథెరపీతో మాడ్చుతూ వైద్యం చేస్తున్నారు. ఈ పద్ధతివల్ల పక్కనున్న మంచి కణాలు కూడా దెబ్బ తినడంతో సైడ్ ఎఫెక్ట్స్ ఏర్పడుతున్నాయి. ఇటీవల హార్వర్డ్ మెడికల్ స్కూలు శాస్త్రజ్ఞులు జరిపిన పరిశోధనలో కేన్సర్ సెల్సును గుర్తించి ఒక మాలుక్యులర్ పద్ధతిలో వాటికి త్వరగా వృద్ధాప్యం వచ్చేలా చేస్తే డ్రగ్సుతో చంపనక్కర్లేకుండా అవి సహజంగానే చచ్చిపోతాయని గుర్తించారుట. సూర్యరశ్మిలో కూర్చుని చర్మంలోని నిర్జీవ కణాలని విసర్జించే పద్ధతిలాంటిదే ఇది అంటున్నారు.

-తటవర్తి



క్కున్న వాటి గురించి మాట్లాడవేం. ఎకరాలకొద్దీ ఆస్తులు నీ నగలకే తరిగిపోయాయి. భవిష్యత్తులో ఏ గుళ్లోనో అమ్మవారి వజ్రకిరీటం చూసి అలాంటివి కావాలని అడిగావంటే మిగిలినదంతా అమ్ముకుని నేనిక బొచ్చె పట్టుకోవాల్సిందే'' అన్నాడు బాబాయి.

"నగలు మాత్రం స్థిరాస్తి కాదా?'' అంది పిన్ని రెట్టిస్తూ.

"పంట పొలం కడుపునిండా అన్నం పెడుతుంది. ఈ నగలు పళ్లెంలో పెట్టుకుని భోజనం చేయలేముగా? వెనుకటి రోజుల్లో రాణీవాస స్త్రీలు పెట్టుకున్నట్లు ఏడువారాల నగలట... పట్టుబట్టి ఇప్పుడు అవి చేయిస్తోంది. ఒక రోజు కెంపులట, ఒకరోజు పచ్చలట, ఒకరోజు ముత్యాలట... ఒకరోజు నీలాలట... ఇదిగో దీని మనాదితోనే నేనిలా చిక్కిశల్యమవుతున్నానమ్మా'' అన్నాడు బాబాయి దీనంగా ముఖం పెట్టి.

ముందు సీట్లో కూర్చున్న డ్రైవరు, భీమయ్యలు మా మాటలు వింటున్నారన్న ఆలోచన రాగానే నగలమీద నుంచి టాపిక్ మార్చి వాళ్ల పిల్లల గురించీ, ఊరి గురించీ వివరాలు అడగడం మొదలుపెట్టాను.

ఎందుకంటే డబ్బులు, నగలు అనగానే ఎప్పుడు ఎవరికి ఏ పాడు బుద్ధి పుడుతుందవో చెప్పలేంకదా.

అందులోనూ బాబాయి చదువుతున్న నగల లిస్టు ఎలాంటివారికైనా తెగులు పుట్టించేదిలా ఉంది.

***

ఆ రోజే మా అబ్బాయి పెళ్లి.

వైట్‌హౌస్‌లో పెళ్లి ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేసారు పెళ్లివాళ్లు. పెళ్లికూతురి గెటప్‌లో మా కోడలు దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

మా అబ్బాయి అసలే అందగాడు కావడంతో పట్టుకుర్తా, పైజామా, ఖండువాలో రాజకుమారుడిలా హుందాగా, దర్జాగా ఉన్నాడు.

అయినా ఏం లాభం? పెళ్లికొచ్చిన బంధువులు, మిత్రులు ఆ జంటను చూడకుండా పెళ్లిమండపంలో ఓ పక్కగా కుర్చీలో కూర్చున్న మా నాంచారమ్మ పిన్నినే చూస్తున్నారు.

ఆమె పెట్టుకున్న ఐదుపేటల చంద్రహారాన్ని, రవ్వల నెక్లెసును, స్వాతీహారాన్ని, మువ్వల వడ్డాణాన్ని, రెండు చేతులకూ వేసుకున్న రెండు డజన్ల గాజులనీ మార్చి మార్చి చూస్తున్నారు.

ఆ చూపులను ప్రశంసలని పొరబడిన పిన్ని మరింత అతిశయంతో మండపం అంతా అటూ ఇటూ హడావుడిగా కలియతిరగడం మొదలుపెట్టింది. ఈ పెళ్లికి... ఈ పెళ్లికనేకాదు, ప్రతి పెళ్లికీ తన స్పెషల్ సెంట్రల్ అట్రాక్షన్ అని పిన్ని అనుకుని ఉంటుంది.

బాబాయి ఆహ్వానితుల్లో కలసిపోయి ఏ మూల కుర్చీలో ఇరుక్కుని కూర్చున్నాడోగానీ ఎంతకూ కనబడలేదు.

పెళ్లయిపోయాక భోజనాలకు అందర్నీ పిలవడంకోసం కిందకి వచ్చి అటూ ఇటూ హడావుడిగా తిరుగుతుంటే అప్పుడు కనిపించాడు బాబాయి వెనుక వరుసలో ఓపక్కన వంటరిగా కూర్చుని.

"అయ్యో... ఇదేంటి బాబాయ్... ఇక్కడ కూర్చున్నావు? ఇందాకటి నుంచీ మీకోసం చూస్తున్నాను'' అన్నాను.


"ఇక్కడ దూరంగా కూర్చుంటే పెళ్లి మండపంలో ఉన్న మీ పిన్ని బాగా కనబడుతుందని...'' అన్నాడు బాబాయి నవ్వుతూ.

"పెళ్లి కనబడుతుంది అనకుండా పిన్ని కనబడుతుంది అంటారా? పిన్నిని రోజూ చూస్తూనే వుంటారుగా'' అన్నాను నేనూ నవ్వుతూ.

"మీ పిన్నిని నేను చూడడం కాదమ్మా. అందరూ వింత జంతువుని చూసినట్లు ఎలా చూస్తున్నారో, ముసిముసి నవ్వులు ఎలా నవ్వుకుంటున్నారో?''

"పొండి బాబాయ్ మీరు మరీనూ.... ఆడవాళ్లు అన్నాక ఆభరణాల మీద, అలంకరణలమీద మోజు లేకుండా ఎలా వుంటుంది చెప్పండి? పాపం పిన్నికి కాస్త నగలమీద ఇంట్రెస్టు ఎక్కువ అని అంతగా బనాయించాలా?''


"మోజు ఉంటే ఫర్వాలేదమ్మా...మరీ గంగవెర్రులెత్తినట్లు పిచ్చి వ్యామోహం ఉండకూడదుకదా. నువ్వు చూడు సింపుల్‌గా ఒక చిన్న



## మరువలేని ప్రేమ

ప్రేమ పర్వతాలని కదిలిస్తుందంటారు. లోగనాథం రెండేళ్లక్రితం మైసూర్ వచ్చినప్పుడు వెదురుతో బొమ్మలు చేసేవాడు. అతని భార్య లక్ష్మి అతనికి నీడలా వెన్నంటి అతనికి బొమ్మల తయారీలో సాయపడేది. ఆమె ఆరునెలలక్రిందట చనిపోయింది. దాంతో అతడను డిప్రెషన్‌కు గురయ్యాడు. భార్య జ్ఞాపకాలు అతన్ని కృంగదీసాయి. మాటిమాటికీ ఆమె గుర్తుకు వస్తుంటే చూసుకోవడానిక పాపం అతని దగ్గర ఫోటో కూడా లేదు. కానీ రెండేళ్లనాడు అతను మైసూరులో బొమ్మలు చేస్తున్నప్పుడు టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక అతనిపై ఒక ఫీచరు ప్రచురిస్తూ ఒక ఫోటోని ముద్రించింది. అది గుర్తుకు వచ్చి ఇటీవల అతను మైసూర్‌కి వచ్చి టైమ్స్ సిబ్బందితో తన బాధని వెళ్లబోసుకున్నాడు. ఆ పత్రిక వారు అతని దీనగాథకి చలించిపోయి రెండేళ్లనాటి పత్రికని వెతికి పట్టుకుని లోగనాథానికి అప్పగించారుట. అతని ఆనందం వర్ణనాతీతం.

-తటవర్తి



సెట్‌తో ఎంత ముచ్చటగా వున్నావో? కొడుకు పెళ్లికి నువ్వు కట్నం తీసుకోలేదనీ, ఓ గొలుసు, నాలుగు గాజులు పెట్టి కోడల్ని అలంకరించావనీ ఇందాక ఆడవాళ్లు ఎవరో చెప్పుకుంటుంటే విని ఎంత ఆనందించానో! పెళ్లికి ఇంతమంది ఆడవాళ్లు వచ్చారు... ఎవ్వరూ మీ పిన్నిలా నగలు దిగేసుకున్నవాళ్లు కనిపించలేదు.''

"ఇక్కడ కూర్చుని ఇందాకటినుంచీ మీరు అందర్నీ అబ్జర్వ్ చేస్తున్నారన్నమాట''

"ప్రస్తుతం నా సమస్య అదేకదా. డబ్బులు ఖర్చుపెట్టి మీ పిన్నికి నగలు కొనియ్యడమేగాక వాటికి కాపలా కాయలేక చస్తున్నాను. నువ్వూ ఒక సెక్యూరిటీ గార్డుని రహస్యంగా అరేంజ్ చేసినట్టున్నావుగా మీ పిన్నికోసం! నా డ్యూటీ అతను చేస్తున్నాడు కనుకనే ఇక్కడికి వచ్చినప్పటినుంచీ ఇదిగో నేనిలా ఫ్రీగా తిరుగుతున్నాను'' అన్నాడు బాబాయ్.

"మీరు కనిపెట్టారన్నమాట. మా ఇంటికొస్తున్న అతిధుల కేర్ మేము తీసుకోవాలికదా. అది మా బాధ్యత. అందులోనూ ఇప్పుడు రోజులు బాగా లేవు'' అని నసిగాను బాబాయ్ ముందు.

"నా బాధా అదేనమ్మా. వంటిమీద నగల కోసం ప్రాణాలు తీస్తున్న రోజులు ఇవి. మా భయం మాదేగాక మేము ఎక్కడికెళ్లినా జనమూ భయపడుతున్నారు మా రక్షణ గురించి.''

"భోజనానికి రండి బాబాయ్'' అన్నాను నేను ముందు నడుస్తూ.

"ఇప్పుడు నువ్వు బిజీగా ఉన్నావు కనుక ఎక్కువగా మాట్లాడించను గానీ ఎలాగైనా మీ పిన్నికి ఈ నగల పిచ్చి తగ్గే ఉపాయం ఏదైనా ఆలోచించాలమ్మా. దీన్ని అందరూ ఓ విచిత్ర వ్యక్తిలా చూస్తుంటే సిగ్గుతో చితికిపోతున్నాను.''

బాబాయ్ అలా అంటుండగా ఎదురుగా మావైపే వస్తున్న పిన్ని కనబడింది. శరీర బరువుకు నగల బరువు తోడు కావడంవల్లనో ఏమో చేతులు వూపుతూ భారంగా నడుస్తూ వస్తున్నది. అంతేకాక మనిషి ఎందుకో చిరాగ్గా, కోపంగా ఉన్నట్లు కనిపించింది. ఆమె వెనుకగా మా భీమయ్య వస్తున్నాడు.

"మీరు ఇక్కడున్నారా?'' అంది మమ్మల్ని చూసి పొడిగా.

"ఎందుకో కోపంగా ఉన్నట్టున్నావు? నీ నగలు బాగున్నాయనిగానీ, ఎక్కడ చేయించారు? ఎన్ని తులాల బంగారం పట్టింది అనిగానీ ఎవ్వరూ అడగలేదా?'' అన్నాడు బాబాయ్ పిన్నిని ఉడికిస్తూ.

కానీ పిన్ని ఆ మాటలను సీరియస్‌గా తీసుకున్నట్లు కనిపించింది.

"అంత మ్యానర్స్ కూడానా ఈ సిటీ జనాలకు. కనీస మర్యాదలే తెలియవు'' అంది రుసరుసలాడుతూ.

"ఏం జరిగింది పిన్నీ?'' అని అడిగాను నేను కంగారుగా.


"ఆవిడెవరో ఆడపిల్ల తరపున ఆవిడ అనుకుంటా... పనిగట్టుకుని మరీ నా దగ్గరకు వచ్చి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూసి 'ఒక్కమాట అడుగుతాను ఏమీ అనుకోకండి. ఇవన్నీ గోల్డ్ నగలేనా? గిల్టా?' అని అడిగింది. నేను చురుగ్గా ఒక్క చూపు చూసేసరికి 'ఆహా ఎందుకడుగుతున్నానంటే ఈ రోజుల్లో గిల్ట్ నగలు కూడా అచ్చం బంగారు వాటిలాగానే చాలా అందంగా చేస్తున్నారు. ఇంత బంగారం కొనాలంటే ఎంత ఉన్నవాళ్లకయినా సాధ్యం కాదు. మనమేమో ఎగువమధ్య తరగతి మాత్రమేనాయె' అంది'' అని పిన్ని అనగానే బాబాయ్ ఫక్కున నవ్వారు.

బాబాయ్ వంక గుర్రున చూసింది పిన్ని.

"ఎవరో ఏదో అంటే నువ్వెందుకు బాధపడాలి పిన్నీ. కొంతమంది అంతే. ఏమైనా అనుకుంటారని అయినా లేకుండా ముఖాన్నే అడిగేస్తుంటారు. అలాంటివాళ్ల మాటలు ఈ చెవితో విని ఈ చెవిలో వదిలేయాలి. ముందు నువ్వు, బాబాయ్ భోజనం చేయండి. ఆ బఫేలో మీరు తినలేరు గానీ ఇలా రండి'' అంటూ టేబుల్ మీల్స్ సెక్షన్‌వైపు వాళ్లను తీసుకువెళ్లి 'బ్రతుకుజీవుడా' అని నేను బయటపడ్డాను.

బాబాయ్ టెన్షన్ దూరం చేయడానికైనా పిన్ని నగల పిచ్చి తగ్గించే ప్రయత్నానికి ప్లాను వేయాలన్న ఆలోచన అంత బిజీలోనూ నా మనసులో వచ్చి చేరింది.

★



## బోయపాటికి డిమాండ్

తొలి చిత్రం 'భద్ర'తో చిత్ర పరిశ్రమను ఆకర్షించిన బోయపాటి శ్రీను రెండో చిత్రం 'తులసి'ని సైతం సూపర్‌హిట్ చేసాడు. మూడో చిత్రం 'సింహ'ను సూపర్ డూపర్ హిట్ చేసి టాలీవుడ్‌లో సరికొత్త రికార్డులను క్రియేట్ చేసాడు. ప్రస్తుతం అనేకమంది నిర్మాతలు బ్లాంక్ చెక్కులతో బోయపాటిని కలుస్తున్నట్లుగా సినీ జనాలు చెప్పుకుంటున్నారు. ప్రస్తుతం ఏ చిత్రానికీ బోయపాటి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. ఆయన ఒప్పుకునే తదుపరి చిత్రం ఏమై ఉంటుందా అని సినీ జనాలు ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

